



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి నాగిరెడ్డి

ఆడుకుంటూ అనంత లోకాలకు..

- కారు ఢీకొని ఏడేళ్ల బాలుడి మృతి
- కంకిపాడులోని అంకమ్మతల్లి గుడి రోడ్డులో ఘటన

కంకిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని కారు రూపంలో మృత్యువు కబళించిన హృదయ విదారక ఘటన కంకిపాడులో శనివారం జరిగింది. అదనపు ఎస్సై తాతాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడులోని అంకమ్మతల్లి గుడి రోడ్డులో నివాసముంటున్న పడాల నాగిరెడ్డి కుమారుడు మోక్షిత్‌రెడ్డి (7) రెండో శనివారం పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్ద సైకిల్‌తో ఆడుకుంటున్నాడు. ఇంతలో అటుగా వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి సైకిల్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో మోక్షిత్ రెడ్డి కుప్పకూలి పోయాడు. వెంటనే ఇంట్లో నుంచి బయటకు వచ్చిన నాగిరెడ్డి కుటుంబ సభ్యులు చిన్నారిని కంకిపాడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించాలని వైద్యులు సూచించారు. చిన్నారిని విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రమాదానికి మిగతా 6లో..

"నోటికి ఏది వస్తే అది మాట్లాడితే ఒళ్లు జాగ్రత్త.. మీరు నరుకుతామంటే మేము గాజులు తొడుక్కోలేదు.. రప్పా.. రప్పా అని ఎవరిని నరుకుతారు? కన్ను కొడితే చీకట్లో ఎవరిని నరుకుతారు?.. మీ దగ్గరికే వస్తున్నాం .. ఎవరిని నరుకుతారో నరకండి.. బస్తీమే సవాల్.. నానీలూ.. ఖబడ్దార్" అంటూ గుడివాడ టీడీపీ శ్రేణులు వైసీపీ ఉన్మాదపు నాయకులపై తిరుగుబాటు చేశారు. గత కొద్ది రోజులుగా టీడీపీ వాళ్లను చంపెయ్యండంటూ కార్యకర్తలను రెచ్చగొడుతున్న మాజీ మంత్రి పేర్ని నానికి దేహశుద్ధి చేయాలని నిర్ణయించారు. విషయం పసిగట్టిన కొడాలి నాని సమావేశానికి డుమ్మా కొట్టారు. పేర్ని నాని మచిలీపట్నం నుంచి నేనొస్తున్నానంటూ.. రెచ్చిపోగా, పోలీసులు ముందస్తుగా ఆయనను గృహ నిర్బంధం చేయటంతో టీడీపీ శ్రేణుల ఆగ్రహాన్ని తప్పించుకున్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టిన వ్యాఖ్యల నేపథ్యంలో జిల్లాలో పలు చోట్ల పేర్నిపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి.



గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ కారు వద్ద మోహరించిన టీడీపీ శ్రేణులు

నానీలూ.. ఖబడ్దార్!

గుడివాడలో పెల్లుబికిన టీడీపీ శ్రేణుల ఆగ్రహం

- నరుకుడు వ్యాఖ్యలు చేసిన పేర్ని నానికి దేహశుద్ధి చేయాలని నిర్ణయం
- సమావేశానికి వస్తున్నట్టు తెలిసి కే కన్వెన్షన్‌ను చుట్టుముట్టిన టీడీపీ శ్రేణులు
- సమావేశానికి డుమ్మా కొట్టి టీడీపీ శ్రేణుల ఆగ్రహాన్ని తప్పించుకున్న కొడాలి నాని
- నేనొస్తున్నా అంటూ బందరులో పేర్ని నాని రెచ్చిపోగా.. పోలీసుల గృహనిర్బంధం
- మచిలీపట్నం, అవనిగడ్డలో పేర్నిపై పోలీసులకు ఫిర్యాదు



టీడీపీ శ్రేణులను బెదిరిస్తున్న ఉప్పాల రాము

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ గుడివాడ/ మచిలీపట్నం): గుడివాడలో సుపరిపాలనలో ఏడాది కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం నిర్వహించారు. పేర్ని నాని ఉన్మాదపు వ్యాఖ్యలు పత్రికల్లో ప్రచురితం కావటంతో కార్యకర్తలు, నాయకులు తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా పలు నియోజకవర్గాల్లో ఉన్మాదులను రెచ్చగొడుతున్నారని, ప్రశాంతంగా ఉన్న గుడివాడ నియోజకవర్గంలో కూడా సమావేశం పెడుతున్నారని, ఇక్కడికి వచ్చే నానీలను అడ్డుకుని తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే వెనిగండ్లపై ఒత్తిడి తెచ్చారు. మరోవైపు పేర్ని నానిపై జిల్లా వ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కూడా టీడీపీ నాయకులు ఖండిస్తున్నారు. దీంతో వెనిగండ్ల రాము వైసీపీ నేతల సమావేశాన్ని అడ్డుకోవాలని నిర్ణయించారు. దీంతో కార్యకర్తలంతా రెట్టించిన ఉత్సాహంతో మధ్యాహ్నం నుంచే కే కన్వెన్షన్ ప్రాంతాన్ని ముట్టడించే ప్రయత్నం చేశారు. వైసీపీ ఫ్లెక్సీలను చించివేశారు. ఇద్దరి కార్యక్రమాలు ఒకే చోట ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. టీడీపీ శ్రేణులు, వైసీపీ సమావేశం వేదిక వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు బ్యారికేడ్లు పెట్టడంతో టీడీపీ శ్రేణులు, పోలీసుల నడుమ మాటల యుద్ధమే జరిగింది. సాయంత్రం వరకు టీడీపీ శ్రేణులు అక్కడి నుంచి కదలలేదు.

పేర్ని నాని వచ్చాడని కారుపై దాడి..

ఈలోపు కృష్ణా జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక తన అధికారిక కారులో వైసీపీ సమావేశానికి వచ్చారు. దీంతో పేర్ని నాని వచ్చారేమోనని భావించిన టీడీపీ కార్యకర్తలు కారు అద్దాన్ని ధ్వంసం చేశారు. ఆ తర్వాత కారులో హారిక ఉందని తెలుసుకుని వదిలేశారు. హారిక భర్త, వైసీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము టీడీపీ కార్యకర్తలకు వేలు చూపిస్తూ మీ సంగతి చూస్తానంటూ హెచ్చరించటంతో .. టీడీపీ నాయకులు రాముపైకి దూసుకెళ్లారు. ఈ దశలో పోలీసులు అడ్డుకోవటంతో గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు సర్దిచెప్పి ఆమెను పంపించేసినా.. వెళ్లినట్టే వెళ్లి ఆమె మళ్లీ వచ్చారు. దీంతో మరింతగా ఉద్రిక్తలు చోటు చేసుకున్నాయి. అగ్రనాయకులు ఎవరూ సమావేశానికి రాకపోవటంతో నిరాశ చెందిన నియోజకవర్గ నాయకులే బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ సమావేశాన్ని నిర్వహించుకున్నారు. బయట టీడీపీ శ్రేణులు ముట్టడించాయని, తమ నాయకులకు బుద్ధి చెప్పటానికి వచ్చారన్న కసితో .. నాయకులదొక దారి అయితే తమదొక దారి అంటూ రెచ్చిపోయి ప్రసంగాలు చేశారు.

సమావేశానికి నాయకులంతా డుమ్మా!

స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు ఉత్తర్వుల మేరకు సంతకాలు చేసేందుకు వచ్చిన మాజీ మంత్రి కొడాలి నాని అటు నుంచి అటే వెళ్లిపోయారు. సమావేశం జరిగే వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. స్థానికంగానే ఉన్న ఆయన సమావేశానికి రాకపోవడం పట్ల వైసీపీ శ్రేణులు అసహనం వ్యక్తం చేశాయి. మాజీ మంత్రులు మిగతా 6లో..

గుడివాడ సమావేశంలోనూ అదే ఉన్మాదం

కొడాలి నాని బూట్లు నాకిస్తామంటూ హెచ్చరికలు

వైసీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో కొందరు నాయకులు అదే ఉన్మాదం ప్రదర్శించారు. కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారు. లింగవరంలోని కె-కన్వెన్షన్‌లో వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ మాట్లాడుతూ నెహ్రూచౌక్ సెంటర్‌లో ఫ్లెక్సీ పెట్టిన వ్యక్తి గతంలో నాని వెంట ఉన్నాడని, తర్వాత మాజీ ఎమ్మెల్యే రావి, నేడు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెంట తిరుగుతున్నాడని, వైసీపీ అధికారంలోకి రాగానే సదరు వ్యక్తితో మాజీ మంత్రి కొడాలి నాని బూట్లను నాకిస్తానని హెచ్చరించారు.

మలి విడత భూ సమీకరణ అవసరమే

- భావితరాల ప్రయోజనాలే ముఖ్యం
- క్వాంటమ్ ఫలాలు అందుకుందాం
- మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు



30 సెంట్ల ప్రభుత్వ భూమి రైతు ఆక్రమణ

- తన పొలంలో కలిపేసుకుని సాగు
- కుచించుకుపోయిన వడ్డిచెరువు డొంకరోడ్డు

పోలీసు సిబ్బంది పనితీరు భేష్

- స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పోటెత్తిన భక్తులు

6

నత్తే నయం!

జిల్లాలో ముందుకు సాగని గృహ నిర్మాణాలు

- అగస్టు నాటికి 3,783 గృహాలను పూర్తి చేయాలని లక్ష్యం
- 15 రోజులకు ఒకసారి సమీక్ష చేస్తున్న కలెక్టర్ బాలాజీ
- అయినా ఊపందుకోని నిర్మాణాలు.. ముందుకురాని లబ్ధిదారులు
- హద్దుమీరుతున్న ఏఈ, డీఈల అవినీతి

జిల్లాలో గృహ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నాటికి 3,783 గృహాలను పూర్తి చేసి శ్రావణ మాసంలో గృహప్రవేశాలు చేయించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు జరగడంలేదు. ఇప్పటి వరకు కేవలం 428 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు, కలెక్టర్ బాలాజీ ప్రతి నెలా 15 రోజులకోసారి గృహనిర్మాణ సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులు వేగవంతం చేయాలని చెబుతున్నా ఫలితం కనిపించడంలేదు. వేసవి కాలంలో పూర్తికాని పనులు వర్షాకాలంలో ఎంతమేర చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.



మచిలీపట్నం గిలకలదిండిలో లేఅవుట్ దుస్థితి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 98,703 గృహాలు నిర్మించాలని గత వైసీపీ ప్రభుత్వంలో లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికి 33,042 వేల గృహాలు పూర్తయ్యాయి. 65,661 గృహాల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. లబ్ధిదారులు గృహ నిర్మాణం కోసం పునాదులు తవ్విన 3,402 గృహాలకు తొలివిడతగా అధికారులు మెటీరియల్‌ను ఇచ్చారు. 11,534 గృహాలు పునాదులు వేసే దశలో ఉన్నాయి. 6,858 గృహాలు పునాదుల దశను దాటాయి. రూఫ్‌లెవల్(కిటికీల) దశ వరకు నిర్మాణం చేసిన గృహాలు 8,019 వరకు ఉన్నాయి. శ్లాబు వేసే దశవరకు నిర్మాణం పూర్తయినవి మరో 2,065 గృహాలు. పూర్తిగా నిర్మాణం అయినవి 428 గృహాలు. ఈ లెక్కలు ఎలా ఉన్నా శ్రావణ మాసంలో జిల్లాలోని 3,783 గృహాలను పూర్తి చేసి, లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాలని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. మండల స్థాయిలో ఉండే ఏఈలు లబ్ధిదారుల వద్దకు వెళ్లి గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నా లబ్ధిదారులు ముందుకు రాని స్థితి నెలకొంది.

అక్రమార్కుల నుంచి నగదు రికవరీ ఎప్పుడు?

అవనిగడ్డ నియోజకవర్గంలో గతంలో పనిచేసిన ఏఈలపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ బాలాజీ ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. అవనిగడ్డ నియోజకవర్గ డీఈగా పనిచేసిన బానోజీరావుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. చల్లపల్లి మండలం ఇన్‌చార్జి ఏఈలుగా పనిచేసిన అరుణకుమారి, వినయ్‌చంద్రను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాలని ఆదేశాల్లో మిగతా 6లో..

బరువును బట్టే డోస్

మెథాన్‌ఫెటమైన్ కేసులో కొత్త కోణం

- కొనుగోలు చేసే వారి బరువును బట్టి డ్రగ్ డోసు
- డోస్‌ల లెక్కనే అమ్మకాలు
- బెంగళూరు నుంచి బెజవాడకు సరఫరా
- బెంగళూర్ బాస్ లెక్క తేల్చే పనిలో పోలీసులు

ఏ పదార్థాన్నైనా గ్రాములు, కిలోల్లో లెక్కిస్తాం. కానీ, కిక్ ఇచ్చే డ్రగ్‌ను మాత్రం డోస్‌ల లెక్కన విక్రయిస్తున్నాడు ఓ ఇంజనీరింగ్ విద్యార్థి. మనిషి బరువును బట్టి డ్రగ్‌ను ఇవ్వడంతో పాటు ఇంజనీరింగ్‌లో ఒత్తిడిని తట్టుకోడానికే మత్తు అలవాటు చేసుకున్నామని చెప్పడం గమనార్హం.



మెథాన్‌ఫెటమైన్ స్వాధీనం చేసుకున్న ప్రదేశంలో నిందితులను విచారిస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మెథాన్‌ఫెటమైన్ డ్రగ్ కేసులో కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం కేదారిలంక గ్రామానికి చెందిన గవర శ్రీరామ వెంకట మణికంఠ సూత్రధారి అని పోలీసులు తేల్చారు. అంబాపురం గ్రామంలోని ఓ తాటాకు పాకలో శుక్రవారం అర్ధరాత్రి డ్రగ్‌ను విక్రయిస్తుండగా, మణికంఠతో పాటు దేశబోయిన ఆకాశ్, శివకుమార్ కౌశిక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అమరావతిలో ఉన్న విట్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుండగా మణికంఠ, ఆకాశ్‌కు పరిచయం ఏర్పడింది. వీరిద్దరికీ కామన్ ఫ్రెండ్ కౌశిక్. అంబాపురానికి చెందిన కౌశిక్ ఇంటర్మీడియెట్ ఫెయిలై టీవీ రిపేర్ల షాపులో పనిచేస్తున్నాడు.

డోస్ లెక్కేంటి?

ఇప్పటి వరకు పోలీసులకు చిక్కిన కేసుల్లో నిందితులు డ్రగ్స్‌ను, గంజాయిని గ్రాముల్లో విక్రయిస్తున్నట్టు గుర్తించారు. మెథాన్‌ఫెటమైన్ డ్రగ్ కేసులో డోస్‌ల లెక్క బయటపడింది. ఈ మెథాన్‌ఫెటమైన్‌ను 'ఎం' అని, 'మెథ' అని పిలుస్తుంటారు. ఈ ముగ్గురు నిందితుల నుంచి పోలీసులు ఐదు గ్రాముల డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని విచారణ చేస్తున్నప్పుడు మణికంఠ కొత్త లెక్క చెప్పాడు. తాను గ్రాముల లెక్కన డ్రగ్‌ను విక్రయించనని, డోస్‌ల లెక్కన విక్రయిస్తానన్నాడు. కొనుగోలు చేసే వ్యక్తి శరీర బరువును బట్టి డోస్ ఉంటుందని తెలిపాడు. కొనుగోలు చేసే వ్యక్తి బరువు 70 కిలోలు ఉంటే, ఒక డోస్ ఇస్తాడు. ఇందుకు రూ.9 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేస్తాడు. డ్రగ్స్‌ను తీసుకునే వారి బరువును బట్టి దాని మత్తు పరిమాణం ఉంటుందని వివరించాడు. సాధారణంగా మాదకద్రవ్యాల అలవాటు ఉన్నవారు ముందుగా కొంత పరిమాణంలో డ్రగ్ తీసుకుంటారు. అది మత్తును ఇవ్వకపోతే మరికొంత తీసుకుంటారు. అది కూడా చాలకపోతే ఇంకొంత తీసుకుంటారు. తీసుకున్న వెంటనే కిక్ ఎక్కడానికి మణికంఠ డోస్‌ల లెక్కను ఎంచుకున్నాడు. బెంగళూరు నుంచి గ్రాము మిగతా 6లో..



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, వేదికపై ఎస్పీ గంగాధరరావు

పోలీసు సిబ్బంది పనితీరు భేష్

- స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి
- సమీక్షలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పెనమలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గత ఆరు నెలలుగా నేరాల దర్యాప్తు, ఫిర్యాదుల పరిష్కారంలో పోలీసులు మంచి పనితీరును ప్రదర్శించారని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ ఆర్ గంగాధరరావు పేర్కొన్నారు. తాడిగడప అన్నే వారి కల్యాణమండపంలో శనివారం జరిగిన అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశంలో కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి పాల్గొని మాట్లాడారు. సిబ్బంది ఇదేవిధంగా పనిచేసి పోలీసు శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని కోరారు. స్నేహపూర్వక పోలీసింగ్‌ను ప్రజలకు చేరువ చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాలపై నిఘా పెంచాలన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రగ్స్, గుట్కా, నిషేధిత మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగానికి అడ్డుకట్ట వేయాలన్నారు. శక్తి టీమ్‌లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళలు సమస్యలను ధైర్యంగా చెప్పుకొనే అవకాశాన్ని కల్పించాలన్నారు. విధులను సమర్థంగా నిర్వహించిన పోలీసు అధికారులకు, సిబ్బందికి మెమెంటోలు అందజేశారు. సైబర్ క్రైమ్ సీఐడీ ఎస్పీ శ్రీనివాసరావు, డీడీ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కె.విజయలక్ష్మి, రీజినల్ మెడికల్ ఆఫీసర్ నిరంజన్‌రావు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే పేర్ని నానితో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ భేటీ

మచిలీపట్నం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గుడివాడలో శనివారం జరిగే వైసీపీ సమావేశానికి వెళ్లే ముందు మచిలీపట్నంలో మాజీ మంత్రి పేర్ని నానితో పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ భేటీ అయ్యారు. గుడివాడలోని సమావేశానికి ఇద్దరూ వెళ్లాల్సి ఉంది. అయితే పేర్ని నాని ఇంటి వద్ద పోలీసులు పహారా ఉండటంతో వీరిద్దరూ గుడివాడ వెళ్లలేకపోయారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి
పేట కోర్టు, సబ్‌జైలు సందర్శన

జగ్గయ్యపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్‌జైలు, సివిల్ కోర్టులను జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి శనివారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య, నందిగామ న్యాయమూర్తి రియాజ్‌తో కలిసి సందర్శించారు. కోర్టులో కేసులు, వాటి పురోగతిని తెలుసుకున్నారు. సబ్‌జైలును పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. వారికందే సౌకర్యాలను పరిశీలించారు. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు జిల్లా జడ్జిని కలిసి సబ్‌కోర్టు త్వరగా మంజూరుకు నివేదికను హైకోర్టుకు సమర్పించాలని కోరారు. వారితో పాటు బార్ ప్రతినిధులు గండికోట శ్రావణ్‌కుమార్, దాసరి నాగేశ్వరరావు, దామాల సంతోష్, కారుపాటి వీరాస్వామి, డీ రత్నబాబు, మన్నెం మురళీ ఉన్నారు.





దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన భక్తులు, ఆలయ పరిసరాల్లో సారె తెచ్చిన భక్తుల సమూహం

భక్తులు పోటెత్తారు!

ఆషాఢ సారె సమర్పణకు వచ్చిన వారితో ఇంద్రకీలాద్రి కిటకిట

ఇంద్రకీలాద్రి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కిటకిటలాడింది. తెల్లవారు జాము నుండే భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ ఈవో శీనానాయక్ స్వయ్యంగా పర్యవేక్షించి, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రత్యేక విధులు కేటాయించటంతో దేవస్థానం సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో రూ.500 అంతరాలయ దర్శ నం రద్దు చేసి సామాన్య భక్తులకు వేగంగా దర్శనం కల్పించారు. ఆషాఢ సారె సమర్పణ నిమిత్తం విచ్చేసిన బృందాలు పాత మెట్లు, మహామండపం మెట్లు, లిఫ్ట్ మార్గం, ఘాట్ రోడ్డు ద్వారా కొండపైకి చేరుకున్నాయి. ఉత్తరాంధ్ర భవానీ దీక్షా సేవా పీఠం అధ్యక్షులు పులపా మల్లేశ్వరరావు గురుభవానీ ఆధ్వర్యంలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల నుంచి సుమారు 1000 మందికి పైగా భక్తులు ఆషాఢ సారె సమర్పణకు వన్‌టౌన్ వినాయక టెంపుల్ నుంచి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. మహామండపం ఆరో అంతస్తులో సారె సమర్పణ బృందాలకు ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం ఏర్పాటు చేశారు. ప్రధాన అర్జిత సేవలైన చండీహోమం, లక్ష కుంకుమార్చన తదితర పూజల్లో భక్తులు పాల్గొన్నారు.



దేవస్థానం సిబ్బంది, పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శీనా నాయక్

భక్తులు ఇంద్రకీలాద్రికి సులువుగా చేరుకునే మార్గాల అన్వేషణ : ఈవో

భక్తులు సులభతరంగా ఇంద్రకీలాద్రి చేరుకోవడానికి అన్ని మార్గాలు అన్వేషిస్తూ అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని దుర్గగుడి ఈవో వి.కె. శీనానాయక్ అన్నారు. దేవస్థానం కార్యాలయంలో శనివారం నగర పోలీసు అధికారులు, దేవస్థానం సిబ్బంది, వైదిక కమిటీతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి కొన్ని గంటల్లోనే విజయవాడ చేరుకుని కుమ్మరిపాలెం సెంటర్ నుంచి ఇంద్రకీలాద్రికి పైకి చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని భక్తులు పేర్కొన్నారని ఆయన అన్నారు. ప్రత్యామ్నాయ దారు లు, టోల్‌గేట్ మార్పు చేయటం వంటి వాటి గురించి సమావేశంలో చర్చించారు. మునిసిపల్ ఆఫీస్ వద్ద హోల్డింగ్ ఏరియా అభివృద్ధి, కనకదుర్గానగర్, దుర్గాఘాట్‌లో ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏర్పాటు, భక్తుల సౌకర్యార్థం పాలన వికేంద్రీకరణ క్రింద కొండ దిగువనే పలు సౌకర్యాలు ఏర్పాటు గురించి పోలీసు అధికారులకు ఈవో వివరించారు. కొండ దిగువన ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ సంస్కృతి ప్రతిబింబేచేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పోలీసు అధికారులు జి.రామకృష్ణ, దుర్గగుడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ కోటేశ్వరరావు, రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఉత్తర్వుల మేరకు ఎస్.ఆర్.ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ-1, ఎకనామిక్స్ (ఉర్దూ మీడియం) - 1, తెలుగు- 2, కెమిస్ట్రీ-2, కామర్స్-1, ఫిజిక్స్-1 పోస్టులకు ఆయా సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్, పాన్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, మూడు సెట్ల దరఖాస్తులను ఈనెల 16వ తేదీలోగా ప్రిన్సిపాల్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల, విజయవాడలోని కార్యాలయానికి అందజేయాలన్నారు. తరగతుల డెమోతో పాటు ఇంటర్వ్యూ ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తామన్నారు. అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అధ్యాపకుల వేతనం గంటకు రూ.375 ఉంటుందని, గరిష్టంగా నెలకు రూ27 వేల గౌర వ వేతనం ఉంటుందని వెల్లడించారు.

గురుకులాల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు రేపు

విజయవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల కోసం ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని విద్యార్థులకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల సమన్వయ అధికారి ఏ.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు బాలికలకు వీరపనేనిగూడెం, బల్లిపర్రు, చల్లపల్లి, మోటూరు పాఠశాలల్లో, బాలురకు రుద్రవరం, పామ ర్రు గురుకుల పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నామన్నారు.



ప్రకృతి సాగు క్షేత్రాన్ని సందర్శిస్తున్న అమెరికా ప్రతినిధులు

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యవంతమైన సమాజం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని బ్లూమ్‌బర్గ్ పబ్లిక్ హెల్త్, జాన్స్ హాప్కిన్ యూనివర్సిటీ (అమెరికా) ప్రతినిధులు డాక్టర్ రాజీవ్.ఎన్.రిమాల్, డాక్టర్ రోహిణి గంజూ అన్నారు. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, బొమ్ములూరు, కానుమోలు గ్రామా ల్లో శనివారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను, కిచెన్ గార్డెన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రకృతి సాగు చేపట్టడం వల్ల భూసారం పెంపొందే అంశాన్ని జిల్లా ప్రాజెక్ట్ అధికారి పార్థసారథి, అడిషనల్ డీపీఎం నాగమల్లేశ్వరి వివరించారు. చిరివాడలో కూరగాయలు, ఆకుకూరల సాగును, కానుమోలులో అనురాధ కిచెన్‌గార్డెన్, టెర్రస్‌గార్డెన్‌లను, హైస్కూల్‌లో న్యూట్రి గార్డెన్ సందర్శించారు. బొమ్ములూరులో ఐదు లేయర్ల సాగును పరిశీలించారు. కానుమోలులోని డ్వాక్రా సంఘాల మహిళలతో ముఖాముఖి నిర్వహించి కిచెన్ వ్యర్థాలతో ఎరువు తయారీ తదితర విషయాలపై చర్చించారు. సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీ దుర్గ, టీమ్ లీడర్ ముఖేష్, అడిషనల్ డీపీఎం నాగమల్లేశ్వరి, వర్షవందన, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మలి విడత భూ సమీకరణ అవసరమే

- భావితరాల ప్రయోజనాలే ముఖ్యం
- క్వాంటమ్ ఫలాలు అందుకుందాం
- మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు



నందిగామ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : భావితరాల ప్రయోజనాల కోసం సీఎంచంద్రబాబు మలి విడత భూసమీకరణ చేపట్టడం అభినందనీయమని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు అన్నారు. మలి విడత 42 వేల ఎకరాల భూ సమీకరణపై ప్రతిపక్షాలు, రిటైర్డ్ రాజకీయ నాయకులు చేస్తున్న విమర్శలపై వసంత తీవ్రంగా స్పందించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాజధాని పటిష్ఠంగా ఉండాలని ఆయన అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు, రాష్ట్రాలను పరిశీలిస్తే అక్కడి రాజధానులు విశాలంగా ఉన్నాయని అన్నారు. హైదరాబాద్‌కు ఐటీని ఆకర్షించేందుకు చంద్రబాబు అప్పట్లో సిద్ధం చేసిన ల్యాండ్ బ్యాంక్ నేటికీ ఆ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతూ వస్తుందన్నారు. ఐటీ అభివృద్ధిని గుర్తించి ఆహ్వానించిన చంద్రబాబు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించాడని అన్నారు. వందలాది ఎకరాలు కేటాయించి చంద్రబాబు నిర్మించిన జినోమ్ వ్యాలీ వల్లనే ప్రపంచంలోని ప్రజలందరికీ కరోనా వ్యాక్సిన్ అందించగలిగామన్నారు. భవిష్యత్ మొత్తం క్వాంటమ్ వ్యాలీపైనే ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో దేశ విదేశాలకు చెందిన యువత అమరావతిలో ఉపాధి పొందుతారన్నారు. ఐటి, పారిశ్రామికీకరణ జరగాలంటే విమానాశ్రయాలు, విద్యాసంస్థలు, వైద్యశాలలు, రహదారులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. అందు కోసమే చంద్రబాబు మలి విడత భూసేకరణకు సిద్ధమయ్యారని అన్నారు. అభివృద్ధి జరిగితే రాష్ట్రంలో ఉనికి ఉండదన్న భావనతో మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటనల పేరుతో అరాచకం సృష్టిస్తున్నాడని ఆరోపించారు. మరలా తాను వస్తానన్న భావన కల్పించి రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయాలన్న ఆలోచన చేస్తున్నాడన్నారు. జగన్ వంటి విధ్వంస నాయకులను ముందే గమనించి చంద్రబాబు రాజధానికి భూములు ఇచ్చిన రైతుల రక్షణకు పటిష్ఠమైన చట్టం తెచ్చారని అన్నారు. అందువల్లే జగన్ ఐదేళ్లలో రాజధాని కదిలించలేక పోయాడన్నారు. మలివిడత ఇంకా పటిష్ఠమైన చట్టంతో భూములు ఇచ్చిన రైతుల హక్కులకు భంగం వాటిల్లకుండా చూస్తాడన్నారు. రాజధానికి భూములు ఇవ్వొద్దంటూ కొందరు సీనియర్ రాజకీయ నాయకులు చేస్తున్న ప్రకటనలు బాధ కలిగిస్తున్నాయని పరోక్షంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావును విమర్శించారు. ఎవరి ప్రభావంతో అటువంటి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎవరు ఎన్ని ప్రకటనలు చేసినా భూములు ఇవ్వాల్సిన రైతులు పట్టించుకోవద్దని, చంద్రబాబుపై నమ్మకంతో భూములు ఇవ్వాలని కోరారు.

బరువును బట్టి డోస్

(5వ పేజీ తరువాయి)

మెథను రూ.4 వేల కొంటాడు. ఇక్కడికి తీసుకొచ్చాక దానిని డోస్‌ల లెక్కన విక్రయిస్తాడు. ఒక డోస్ అంటే గ్రాములో పదో వంతు అని పోలీసులకు లెక్కలు చెప్పాడు.

బెంగళూరు బాస్ ఎవరు?

మణికంఠకు మెథాను సరఫరా చేస్తున్న బెంగళూరు బాస్ ఎవరన్న దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ వ్యక్తితో మణికంఠ, ఆకాశ్ ఇన్‌స్టా ద్వారా చాటింగ్ చేసినట్టు గుర్తించారు. ఈ ఇద్దరు విట్ కళాశాలలో చదువుతున్నప్పటి నుంచే మెథాకు అలవాటు పడ్డారు. తమకు జర్మనీలో ఉంటున్న హేమంత్ అనే యువకుడి ద్వారా ఈ డ్రగ్ అలవాటైనట్టు పోలీసుల విచారణలో వెల్లడించారు. అతడు ఎవరో వివరాలను బయటకు లాగే పనిలో పోలీసులు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కొంతమంది ఇంజనీరింగ్ పట్టభద్రులు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ ఎండీఎంఏ వంటి డ్రగ్‌ను తయారు చేసి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం ఉంది. ఇలా బెంగళూరు నుంచి ఎండీఎంఏను తీసుకొస్తూ ఇద్దరు, ముగ్గురు యువకులు విజయవాడ పోలీసులకు చిక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక్కడ డ్రగ్స్‌తో దొరికిన వారికి ప్రతి కేసులోనూ బెంగళూరుతో లింక్‌లు ఉంటున్నాయి. మణికంఠ బెంగళూరులో ఉన్న వ్యక్తితో ముందుగా ఇన్‌స్టాలో చాటింగ్ చేసి ఎంత మొత్తంలో డ్రగ్ కావాలో చెబుతాడు. దానికి సంబంధించిన డబ్బును ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లిస్తాడు. తర్వాత ఆ వ్యక్తి డ్రగ్‌ను ఒకచోట ఇచ్చి ఆ ప్రదేశం పేరు చెబుతాడు. అక్కడి నుంచి డ్రగ్‌ను తీసుకుని మణికంఠ విజయవాడ చేరుకుంటాడు. ఈవిధంగా మణికంఠ ఏడాది నుంచి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ డ్రగ్‌ను ఎందుకు అలవాటు చేసుకున్నారని పోలీసులు అడిగినప్పుడు మణికంఠ, ఆకాశ్ విచిత్రమైన సమాధానం చెప్పారు. ఇంజనీరింగ్‌లో ఉన్న ఒత్తిడిని తట్టుకోవడానికి, రాత్రిపూట ఎక్కువసేపు మేల్కొని చదవడానికి అలవాటు చేసుకున్నామని చెప్పినట్టు తెలిసింది.

30 సెంట్ల ప్రభుత్వ భూమి రైతు ఆక్రమణ

- తన పొలంలో కలిపేసుకుని సాగు
- కుచించుకుపోయిన వడ్డిచెరువు డొంకరోడ్డు



రైతు డొంకరోడ్డును ఆక్రమించి పొలంలో కలిపేసుకున్న ప్రభుత్వ భూమి

(ఆంధ్రజ్యోతి - ఉయ్యూరు)

గండిగుంట గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 1.50 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని తన పొలంలో కలిపేసుకుని సాగు చేపట్టాడు. ఉయ్యూరు - కాటూరు రోడ్డులో కాకానినగర్ సమీపాన వడ్డి చెరువు వెళ్లే మార్గంలో 35 అడుగుల వెడల్పు ఉన్న డొంకరోడ్డును సుమారు 30 సెంట్ల వరకు రైతు ఆక్రమించుని తన పొలంలో కలుపుకుని సాగు చేస్తున్నాడు. డొంకను పొలంలో కలిపేసుకోవడంతో డొంక మార్గం కుచించుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. ఇదే డొంకరోడ్డులోనే గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే తహసీల్దార్ కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు విలువచేసే ఎకరానికి పైగా పొలాన్ని ఒక రైతు విరాళంగా ప్రభుత్వానికి ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయం, రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాలు నిర్మించగా, పోలీస్ స్టేషన్‌ను ఇటీవలే ప్రారంభించారు. మిగిలిన భవనాల నిర్మాణం పూర్తయి ప్రభుత్వ కార్యకలాపాలు ప్రారంభిస్తే డొంకరోడ్డు ఇరుకుగా మారి ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డొంక భూమిని ఒక రైతు పొలంలో కలుపుకున్న విషయమై పరిసర పొలాల రైతులు తహసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి గ్రామపంచాయతీ భూమి ఆక్రమణకు గురైనట్టు తేల్చారు.

చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్

వడ్డిచెరువు డొంకను ఆక్రమించి రైతు పొలంలో కలిపేసుకుని సాగు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చిందని, 30 సెంట్ల వరకు ఆక్రమణ జరిగినట్టు సర్వేలో నిర్ధారణ అయ్యిందని, సదరు రైతుపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సురేశ్ కుమార్ తెలిపారు.

పేర్ని నాని, కిట్టూలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- బందరు టీడీపీ నాయకుల డిమాండ్

మచిలీపట్నం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడు పేర్ని కిట్టులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఆర్‌పేట పోలీసు స్టేషన్‌లో పేర్ని నానిపై ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చీకట్లో అడ్డువచ్చిన వారిని నరికి తెల్లారే పరామర్శకు వెళ్లాలని చెప్ప డం, కనుసైగలతో ప్రాణాలు తీస్తామని మాట్లాడటం పేర్ని నాని కిరాతక వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. పీకలు కోసి అధికారంలోకి రావాలని వైసీపీ నేతలను కోరడం సహించరాని విషయమన్నారు. మచిలీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని మాట్లాడుతూ, పీకలు కోయాలనడం పేర్ని నాని దుర్మార్గ వైఖరికి నిదర్శనమన్నారు. నగర టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి మాట్లాడుతూ, వైసీపీ నాయకుల అరాచకత్వం రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా, టౌన్‌హాలు మాజీ అధ్యక్షుడు చిన్నం శివ, బందరు రూరల్ మండల టీడీపీ కార్యదర్శి కాటం మధుసూదనరావు, బొడ్డు శ్రీను, అడపా రత్నాకర్, మరకాని వాసు తదితరులు పాల్గొన్నారు.

తాలూకా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు



బందరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాగిత వెంకటేశ్వరరావు

కన్ను కొడితే చీకట్లో అన్నీ అయిపోవాలంటూ వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి పేర్నినానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం రాత్రి తాలూకా పోలీస్‌స్టేషన్‌లో మాజీ ఎంపీపీ, టీడీపీ రూరల్ పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. కాగిత వెంకటేశ్వరరావుతో పాటు జిల్లా ప్రభుత్వాసుపత్రి కమిటీ అధ్యక్షుడు తలారి సోమశేఖర్, లంకే శేషగిరి, వక్కపట్ల శ్రీను, కాటం మధుసూదనరావు, వీరంకి నాగమునీశ్వరరావు, అమ్మిరెడ్డి శివ, చిట్టిబొమ్మ వనరాజు, ఈడే రాంబాబు, పామర్తి లక్ష్మణ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

నానీలూ..ఖబడ్దార్!

(5వ పేజీ తరువాయి)

కొడాలి నాని, పేర్ని నానిలతో పాటు జిల్లా ముఖ్య నాయకులెవ్వరూ సమావేశానికి హాజరు కాకపోవడం గమనార్హం. వైసీపీ మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురున్నాథం ఒక్కరే సమావేశానికి హాజరు కావడం విశేషం. కొందరు నాయకుల ప్రసంగాలు కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా సాగాయి. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో గుడివాడలో భారీ బందోబస్తుగా ఏర్పాటు చేశారు.

వివాదాస్పదంగా కొడాలి నాని ఫ్లెక్సీ

స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదంగా మారింది. గత ఎన్నికలకు ముందు కుప్పంలో చంద్రబాబు గెలిస్తే రాజకీయాలు వదిలేసి చంద్రబాబు బూట్‌లను పాలిష్ చేస్తానని చేసిన వాగ్దానాన్ని కొడాలి నాని నేరవేర్చాలంటూ టీడీపీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. పట్టణంలో పలుచోట్ల మాజీ మంత్రి నానిని ట్రోల్ చేస్తూ ఫ్లెక్సీలు వెలిశాయి.

పేర్ని నానిపై పోలీసులకు ఫిర్యాదులు

మాజీ మంత్రి పేర్ని నానిపై టీడీపీ నాయకులు శనివారం మచిలీపట్నంలోని రాబర్ట్‌సన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కృష్ణాజిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే వైసీపీ సమావేశాల్లో పాల్గొంటున్న పేర్ని నాని వైపీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా, హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్నారని తెలిపారు. దీంతో జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, విచారణ చేసి చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. "రప్పా.. రప్పా అంటూ వ్యాఖ్యలు చేయడంకాదని, చెప్పకుండా నరికేయాలని, చీకట్లో కన్నుకొడితే పని అయిపోయేలా ఉండాలని" వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా పేర్ని నాని వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. పేర్ని నాని వ్యాఖ్యలు తెలుగుదేశం, జనసేన నాయకులు, సానుభూతిపరులపై దాడులు చేయాలనే విధంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్షుడు లొగిశెట్టి వెంకటస్వామి, టీడీపీ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, కుంచేనాని తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన పేర్ని నానిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. బందరు తాలూకా పోలీస్ స్టేషన్‌లోనూ టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పేర్నినానిపై ఫిర్యాదు చేశారు.



పేర్ని నానిపై చర్య కోరుతూ అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు

నత్తే నయం!

(5వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో గృహనిర్మాణశాఖ అధికారులు ఈ ఇద్దరు ఏఈలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో చల్లపల్లిలో పనిచేసి ముదినేపల్లి మండల ఏఈగా ఉన్న వై.శేషగిరారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అవనిగడ్డ నియోజకవర్గంలోని మండలాల్లో రూ.39 లక్షల మేర అవినీతి జరిగినట్లు అధికారులు తమ విచారణలో తే ల్చారు. ఈపరిణామం అనంతరం కోడూరు మండలం గృహనిర్మాణ సంస్థలో పనిచేసిన ఏఈపై మరిన్ని ఫిర్యాదులు రావడంతో అధికారులు విచారణ చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.36 లక్షల విలువైన ఇనుము, సిమెంటు పక్కదారి పట్టినట్లుగా గుర్తించినట్లు గృహనిర్మాణ సంస్థ పీడీ వెంకట్రామ్ తెలిపారు. కోడూ రు మండలంలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై ఇంకా విచారణ జరుగుతోందని, త్వరిత గతిన ఈ విచారణను పూర్తి చేస్తామని చెప్పారు. గత ఏప్రిల్‌లో అక్రమాలకు పాల్పడిన ఏఈలపై చర్యలు తీసుకున్నా, గత రెండున్నర నెలలుగా వారి నుంచి ఒక్క రూపాయి కూడా రికవరీ చేయకపోవడం గమనార్హం. అధికారులు వారి నుంచి నగదు రికవరీకి ఎంత సమయం తీసుకుంటారనేది వేచి చూడాలి.

డీఈపై విచారణ చేసినా చర్యల్లేవు!

పామర్రు డివిజన్ గృహ నిర్మాణ సంస్థ డీఈగా గతంలో పనిచేసి రమేష్‌కుమార్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి పెదపారుపూడి మండలంలోని లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సిమెంటు, ఇనుము ఇవ్వకుండా, పామర్రులో ఒక గోడౌన్‌లో ఉంచి డీఈ కనుసన్నల్లో గుట్టుచప్పుడు కాకుండా లారీల కొద్ది సిమెంటు, ఇనుమును విక్రయించారనే ఆరోపణలపై ఫిర్యాదులు అందాయి. గతంలో పామర్రు డీఈగా పనిచేసిన సదరు అధికారి ఆ తర్వాత జిల్లా కార్యాలయానికి బదిలీపై వచ్చి ఇక్కడ మేనేజరు, డీఈగా కొంతకాలం పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈ డీఈ గుడివాడ డివిజన్‌కు బదిలీ అయ్యారు. పెదపారుపూడి మండలంలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదులు అందడంతో ఆ మండలంలో పనిచేసే సిబ్బందిని జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయానికి పిలిపించి రెండు నెలల క్రితం విచారణ చేశారు. ఆ మండల సిబ్బంది ఉన్నది ఉన్నట్లుగా అధికారుల విచారణలో చెప్పారు. అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగు చూసినా జిల్లాస్థాయి అధికారులు ఈ డీఈపై చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కించడం వెనక బలమైన కారణాలు ఉన్నాయని సంస్థలో పనిచేసే అధికారులు చెప్పుకుంటున్నారు. పెదపారుపూడి మండలంలో జరిగిన అక్రమాలపై విచారణ తుది దశలో ఉందని గృహనిర్మాణ సంస్థ పీడీ తెలిపారు.

ఆడుకుంటూ అనంత లోకాలకు..

(5వ పేజీ తరువాయి)

కారణమైన కారు డ్రైవరు భూపతి వెంకట శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాసరావు అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య డయాలసిస్ పేషెంట్ కావడంతో ఆమెను విజయవాడ తీసుకువెళ్లి తిరిగి వస్తుండగా, ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. చిన్నారి తండ్రి నాగి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

సబ్‌జైల్ పరిశీలన



గన్నవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా న్యాయసేవా ధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి.గోపి పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ముద్దాయిలతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, సక్రమైన మార్గంలో నడుచుకోవాలన్నారు. క్షణికావేశంలో చేసే తప్పులే శిక్షలకు దారితీస్తాయని చెప్పారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ కృష్ణయ్య, గన్నవరం జడ్జి అరుణ శ్రీ, సబ్‌జైల్ సూపరింటెండెంట్ రాంబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



కేసరపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు..



బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్..



యనమలకుదురులో..

గన్నవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని కేసరపల్లిలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఇంటింటికి తిరుగుతూ గత ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా విన్న ఆయన వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, నియోజకవర్గంలో గ్రామీణ నీటిపారుదల శాఖ ద్వారా ఆధునికీకరణ అభివృద్ధి పనులకు ఈ ఏడాది కాలంలో రూ.85 లక్షల ఖర్చు చేసినట్లు వివరించారు. పాడి రైతులకు సహాయం చేయూత నిచ్చేందుకు రూ. 3.26 కోట్ల ఖర్చుతో 186 మినీ గోకులం షెడ్లు నిర్మించినట్లు యార్లగడ్డ వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ జాస్తి విజయభూషణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు గూడపాటి తులసీమోహన్, ప్రధాన కార్యదర్శి బోడపాటి రవి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోసూరి వెంకటేష్, అన్నే అంజి బాబు, అన్నే హరి కృష్ణ, మల్లంపాటి బన్ను, మూల్పూరి లక్ష్మి ప్రసాద్, గూడపాటి దుర్గ ప్రసాద్, ముల్పూరి భాను, జాస్తి కిషోర్, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, కాసన్నేని రంగబాబు, కొసరాజు సాయిరాం, పరుచూరి నరేష్, జనసేన నాయకులు చిమట రవి వర్మ పాల్గొన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు ..

కంకిపాడు : అర్హులందరికి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలు ఆలోచించాలన్నారు. ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజా ప్రతినిధులు తెలుగుతమ్ముళ్లు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో సర్పంచులను సీఎం జగన్ తీవ్రంగా ఇబ్బందికి గురిచేశారన్నారు. అనంతరం సుమారు 10 మందికి సుమారు రూ. 4 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనూష, సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, చలవాది రాజ, వణుకూరు విక్రం, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు 11వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైవీబీ



సనత్‌నగర్‌లో వెలగపూడి శంకరబాబు తదితరులు

ఉయ్యూరు 11వ వార్డులో..

ఉయ్యూరు : వైసీపీ ప్రభుత్వ అసమర్ధ, అవినీతి పాలనతో రాష్ట్రం అధోగతి పాలైన పరిస్థితుల్లో ఆర్థిక పరిస్థితిని గాడిలోపెట్టి ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైబీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు 11వ వార్డులో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, పార్టీ నాయకులు వాసు, జగరోతు నాగరాజు, జయదేవ్, జ్యోతి, నరేశ్, వంగవీటి శ్రీనివాసప్రసాద్, శివప్రసాద్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి రాకతో రాష్ట్రాభివృద్ధికి పునాది

పెనమలూరు : ఏడాది క్రితం సైకో పాలనకు వ్యతిరేకంగా కలసిన టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతోనే రాష్ట్ర అభివృద్ధికి పునాది పడిందని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, యనమలకుదురు టీడీపీ నాయకులు అనంతనేని ఆజాద్‌లు పేర్కొన్నారు. సైకో పాలనతో విసుగు చెందిన రాష్ట్ర ప్రజలకు మూడు పార్టీల కలయిక ఊరటనిచ్చిందని అభిప్రాయపడ్డారు. శనివారం కానూరు, యనమలకుదురులలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆగస్టు నుంచి ప్రభుత్వం రాష్ట్ర మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కలిపించనున్నదని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో సుంకర చినబాబు, తమ్ము అశోక్ చక్రవర్తి, కల్యాణపు శ్రీనివాస్, వెలగపూడి రాజశేఖర్, పుట్టం రాజు రమేష్, తుమ్మల కిషోర్, దోనేపూడి రవికిరణ్, మాదు రామకృష్ణ పాల్గొన్నారు.

వెలగపూడి ఆధ్వర్యంలో..

కానూరు : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం కానూరు సనత్‌నగర్, పెద్దమసీద్, రేకులమసీద్ తదితర ప్రాంతాల్లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ఆధ్వర్యంలో స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానికంగా ఏసమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే టీడీపీ అధిష్టానానికి తెలిపి పరిష్కారానికి కృషి చేస్తామని శంకరబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు ఇమామ్, రఫీ, రమేష్, రియాజ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కానూరులో చెత్తకుప్పల తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



కానూరు, జూలై 12 (ఆంధ్ర జ్యోతి) : చెత్తశుద్ధి ఏదీ. కానూరులో అడుగడుగునా చెత్తకుప్పలు అనే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి తాడిగడప మున్సిపల్ అధికారులు స్పందించారు. కానూరు అశోక్‌నగర్‌తోపాటు తులసీనగర్, సనత్‌నగర్, పెద్దమసీద్ వీధి తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించారు. అదేవిధంగా రోడ్లను కూడా శుభ్రపరిచారు. ఈ సందర్భంగా తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ మాట్లాడుతూ, పారిశుధ్య సిబ్బంది కొరత వల్ల సకాలంలో చెత్తను ఏరోజుకారోజు అన్ని ప్రాంతాల్లో తొలగించలేకపోతున్నామని చెప్పారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు.



అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

వాసవీమాతకు ఆషాఢ సారె

హనుమాన్‌జంక్షన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి మాతకు ఆషాఢం మాసం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని, అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం నేతలు కపిల వాయి భగవతి, చలువాది రాజ్యలక్ష్మి, కొనకళ్ల ధనలక్ష్మి నాయకత్వంలో మహిళలు పెద్ద ఎత్తున సారెతో ఊరేగింపుగా తరలివెళ్లి సమర్పించారు. ఆర్యవైశ్య నేతలు బొమ్మిశెట్టి రామారావు, కొనకళ్ల రాజశేఖర్, నారిక మల్లి ప్రసాద్, తవ్వా కుటుంబరావు, చామర్తి లోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిం చేలా గంగానమ్మతల్లికి ఆషాఢసారె సమర్పిస్తున్నామని కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య తెలిపారు. రంగయ్యప్పారావుపేటలో శనివారం కోందడరామస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవత గంగానమ్మతల్లికి ఘనంగా ఆషాఢ సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి నాగమల్లేశ్వరి, కొల్లిపర్ల రత్నమాణిక్యం, వెంకటసుబ్బమ్మ, కొమ్మినేని విజయలక్ష్మి మహిళలు పాల్గొన్నారు.



రంగయ్యప్పారావుపేటలో గంగానమ్మకు ఆషాఢ సారె

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

హనుమాన్‌జంక్షన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని మరింత నైపుణ్యంతో జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని హనుమాన్‌జంక్షన్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోనీ కంపెనీ వర్క్‌షాప్ నిర్వహించారు. సోనీ కంపెనీ ప్రతినిధి చైతన్య ఫోటోగ్రఫీ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు.

ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

కంకిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. అబ్దుల్ షబ్బీర్‌కు కుటుంబ సభ్యులతో వివాదం నెలకొంది. తన మాట వినడం లేదని ఆత్మహత్యాయత్నానికి నిశ్చయించుకున్నాడు. ఈ విషయాన్ని తన మేస్త్రీకి ఫోన్ చేసి చెప్పాడు. స్పందించిన మేస్త్రీ ఈ విషయాన్ని 112 ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. రంగంలోకి దిగిన పోలీసులు అతన్ని కాపాడారు.



బుద్దవరం పీఏసీఎస్ చైర్ పర్సన్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు తులసి మోహన్

రైతుల మన్ననలు పొందాలి

గన్నవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించి వారి మన్ననలు పొందాలని టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్ అన్నారు. మండలంలోని బుద్ధవరం పీఏసీఎస్ చైర్ పర్సన్‌గా ముద్రబోయిన శ్రీనివాసరావు, డైరెక్టర్‌లుగా గుర్రం రవి సత్యనారాయణ, మన్నే శ్రీనివాసరావులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. సర్పంచ్ బడుగు బాలమ్మ, గన్నవరం ఉప సర్పంచ్ పాలడుగు నాని, గొంది నరేంద్ర, డీసీ చైర్మన్ కొసరాజు రాము, గూడవల్లి నాగేశ్వరరావు, ముప్పిడి ప్రవీణ్ కుమార్ (దొరబాబు), చోడవరపు ధర్మారావు, కారంపోడి సాంబశివరావు, కంభంపాటి లక్ష్మి, గండికోట గోవర్దన్, కర్నాటి నాగార్జున, తాడిపత్రి నాగరాజు, తాడిశెట్టి రవి, సొసైటీ సీఈవో వల్లభనేని శ్రీనివాసరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని చైర్‌పర్సన్ కొల్లి వెంకట లక్ష్మీనారాయణ అన్నారు. కొయ్యూరు పీఏసీఎస్‌లో డైరెక్టర్లు పల్లగాని సుబ్బారావు, శిలారపు మరియమ్మలతో కలిసి శనివారం పదవీప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని సర్పంచ్ కొల్లి వీరవెంకట సత్యనారాయణ, పాల సొసైటీ అధ్యక్షుడు తూమాటి రామకృష్ణ, టీడీపీ నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, చిన్నాల చిన్నా, మూల్పూరి సాయికళ్యాణి, అధ్యక్షుడు తూమాటి సాంబశివ రావు, కాంద్రు అజయ్, తెలుగు యువత నాయకులు అభినందించారు. మల్లవల్లి పీఏసీఎస్ చైర్మన్ జాన్‌బాషా పదవీబాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు అక్కినేని ధర్మరాజు, కృష్ణాజీ, డైరెక్టర్లు అరేపల్లి వెంకటేశ్వరరావు, చిన్నాల నరసింహారావు, తూము రాధాకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూరు పీఏసీఎస్ పాలకవర్గాన్ని అభినందిస్తున్న టీడీపీ నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు

సీసీ రోడ్ల నాణ్యతను పరిశీలించాలి

ఉయ్యూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రాష్ట్రంలోని వివిధ గ్రామాల ఎస్సీ, బీసీ కాలనీల్లో నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. మండల పరిధి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు శనివారం కలవపాముల వచ్చిన కేంద్ర బృందాన్ని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పొనుగుమాటి శివ నాగ మల్లికార్జునరావు, మండల పార్టీ అధ్యక్షురాలు పొనుగుమాటి జ్యోత్స్న కలసి విజ్ఞాపనపత్రం అందజేశారు.



కలవపాములలో సెంట్రల్ టీమ్‌కు మెమొరాండం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

సాగునీరు అందించండి: సీపీఎం

గుడివాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): కాలువల్లో సాగునీరు విడుదల చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, అది కేవలం వీడియోలకు పరిమితమవ్వకుండా సాగుకు అవసరమైన నీరు అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా నీళ్ల అందడం లేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, సకాలంలో ఎరువులను అందుబాటు ఉంచాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శొంఠి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతు శ్రీనివాస్ పాల్గొన్నారు.



గుడివాడలో ఇంటింటికీ వెళ్లి మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం 19, 20, 23, 24 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వచ్చే నాలుగేళ్లలో గుడివాడలో భారీ అభివృద్ధి కార్యక్రమాలు చేసేలా పని చేస్తున్నానని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, నాయకులు లింగం ప్రసాద్, రాంబాబు, సాంబశివరావు, ఉమా, నిమ్మగడ్డ సత్యసాయి, జానీ షరీఫ్, ఇమ్మానుయేలు, రాజేష్, గుడివాడ జోన్స్, నెరుసు కాశీ, రెడ్డి షణ్ముఖ్, కంచర్ల సుధాకర్, గోవాడ శివ, సయ్యద్ జబీన్, నాగరాజు, రామదేను వేణుబాబు, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

కొత్త మల్లాయిపాలెం, చౌటపల్లిలో..

గుడివాడ రూరల్: కొత్త మల్లాయిపాలెం, చౌటపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, చౌటపల్లి, మల్లాయిపాలెం నాయకులు అట్లూరి రమణప్రసాద్, వి.వెంకటేశ్వరరావు, రామ్మోహనరావు, ఉంగరాల మురళి, దుడ్డు రవి, నూర్ అహ్మద్, జానీబాషా, నజీర్ పాల్గొన్నారు.



11వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు

11వ వార్డులో..

గుడివాడ: టీడీపీ నాయకుడు సయ్యద్ జబీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు పాల్గొన్నారు. నాయకులు షేక్ మౌలాలి, షేక్ కరీముల్లా, జానీ షరీఫ్, అబ్దుల్ మున్వర్, పట్టపు చిన్న, మల్లికాబేగం, సయ్యద్ మోబీన్, షేక్ రఫీ, గడ్డం ప్రకాష్‌దాసు, సయ్యద్ హుసేన్, అబ్దుల్ నయీం, అబ్దుల్ రఫీ, బాజీ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ సమావేశానికి
ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరు

పామర్రు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన విశాఖపట్నంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరయ్యారు. సమర్థవంతమైన పాలన కోసం కమిటీ అవలంబించాల్సిన విధివిధానాలపై సభ్యులతో చర్చించినట్లు ఆయన తెలిపారు.



విశాఖలో పబ్లిక్ అండర్‌టేకింగ్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



కల్వపూడి అగ్రహారంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్

ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచండి

● ఎంపీడీవో విష్ణుప్రసాద్ ఆదేశం

గుడివాడ రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఎంపీడీవో విష్ణుప్రసాద్ ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌కు కల్వపూడి అగ్రహారం గ్రామం ఎంపిక అవడంతో ఆ గ్రామాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం, పాఠశాల, పంచాయతీ భవనాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను ఉదయమే ఫొటోల రూపంలో పంపాలన్నారు. వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి అవ్వమ్మ పాల్గొన్నారు.

16న మెగా జాబ్‌మేళా

మచిలీపట్నం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ఏజే కళాశాలలో ఈనెల 16న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ 45వ డివిజన్ ఇన్‌చార్జి పి.వి.ఫణికుమార్ సూచించారు. శనివారం జాబ్ మేళా కరపత్రాలను నిరుద్యోగ యువతకు ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం ఆలోచన చేసే మంత్రి కొల్లు రవీంద్రపై వైసీపీ నేతల విమర్శలు సిగ్గుచేటన్నారు.

అధ్వానంగా..

కొండిపర్రు ప్రధాన రహదారి ● మరమ్మతులు చేయాలని గ్రామస్థుల డిమాండ్

(ఆంధ్రజ్యోతి-పామర్రు): కొండిపర్రు గ్రామ ప్రధాన రహదారి, గ్రామంలో హరిజనవాడకు వెళ్లే రహదారి గోతులతో అధ్వానంగా ఉన్నాయి. ప్రధాన రహదారిపై గోతుల్లో పంచాయతీ డ్రెయినేజీల నుంచి వచ్చే మురుగుతోపాటుగా వర్షపునీరు నిలుస్తోంది. పామర్రుకు ఈ రోడ్డుపైనే గ్రామస్థులు రావాలి. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. హరిజనవాడకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. రోడ్లు అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కొండిపర్రు ఆర్చి సమీపంలో రోడ్డుపైన గుంతల్లో నిలిచిన వర్షపునీరు



గుంతలమయంగా కొండిపర్రు రహదారి

తక్షణ మరమ్మతులు చేయండి



పామర్రు నుంచి కొండిపర్రు వెళ్లే రహదారికి తక్షణ మరమ్మతులు చేయాలి. హిందూ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేయడానికి ఈ రోడ్డుపైనే వెళ్లాలి. గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. రాత్రి సమయంలో గ్రామంలోకి వెళ్లడానికీ నానా పాట్లు పడుతున్నారు. **- విలాసాగరపు శివకృష్ణ, గ్రామస్థుడు**

వైసీపీకి రాజకీయ సమాధి కట్టండి

ప్రజలకు గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పిలుపు

తోట్లవల్లూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): హింసావాదమే వైసీపీ లక్ష్యంగా మారిందని, ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ నుంచి కిందిస్థాయి నేతల వరకూ నోటి వెంట రప్పా రప్పా నరుకుతాం అనేమాట తప్ప వేరొకటి రావడంలేదని, హింసను ప్రేరేపిస్తున్న వైసీపీకి రాజకీయ సమాధి కట్టాలని ప్రజలకు గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పేర్ని నానీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలు నాలుక చీరేస్తారని గురుమూర్తి హెచ్చరించారు. అధికారం ఇస్తే మెరుగైన పాలన అందిస్తామని ప్రజలకు చెప్పటం రాజకీయ పార్టీల లక్షణమని హితవు పలికారు. అధికారమిస్తే రప్పా రప్పా నరుకుతాం అందర్నీ లేపేస్తాం అని ప్రకటించటం వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శనమని పేర్కొన్నారు. రౌడీ షీటర్లు గంజాయి బ్యాచ్‌ని పరామర్శిస్తున్న జగన్ అరాచకత్వాన్ని, హింసను ప్రోత్సహిస్తున్నట్టేనన్నారు. హింసాప్రవృత్తిని వ్యాపింపజేస్తున్న వైసీపీకి ప్రజాస్వామ్యంలో స్థానం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సూచించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉదయం మధుమేహ వ్యాధి ఉచిత చికిత్సా శిబిరం నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లు, శిబిర కో-ఆర్డినేటర్ మూల్పూరి సుధాకర్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో గుడివాడకు చెందిన డాక్టర్ గవిర్నేని రజని వైద్యసేవలందిస్తారని పేర్కొన్నారు.



మహేశ్వరపురం, గురువిందగుంట గ్రామాల మధ్య పాత లింగవరం సాగునీటి కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన

శిథిలావస్థలో వంతెన

● పునర్నిర్మించాలని ప్రజల డిమాండ్

(ఆంధ్రజ్యోతి-పెదపారుపూడి): ఆర్ అండ్ బీ రోడ్డుపై శిథిలమవుతున్న వంతెనను పునర్నిర్మించాలని ప్రభుత్వాన్ని, అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు. మహేశ్వరపురం, గురువిందగుంట గ్రామాల మధ్య పాత లింగవరం సాగునీటి కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఏ క్షణానైనా కూలిపోయే ప్రమాదం ఉందని మహేశ్వరపురం, దూళ్లవానిగూడెం, దోసపాడు, తమ్మలంపాడు, నాగాపురం, సోమవరప్పాడు, మోపర్రు గ్రామాల ప్రజలు అంటున్నారు. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన పెదపారుపూడికి ప్రభుత్వ కార్యాలయాలకు అవసరాల నిమిత్తం వెళ్లడానికి ఇదే ప్రధాన రోడ్డు మార్గం. వంతెన కూలిపోతే తమ రాకపోకలకు చాలా ఇబ్బంది పడతామని వారంటున్నారు. మండల, జిల్లా అధికారులు స్పందించి, శిథిలమవుతున్న ఈ వంతెనను సందర్శించి, వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

రైతులకు వస్త్రాల పంపిణీ

గుడివాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) శనివారం తన జన్మదినాన్ని రైతుల మధ్య జరుపుకొన్నారు. ఆదర్శనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. భోజనాలు పెట్టారు. కార్యక్రమంలో బోనం గోపిక, శాలిని, పండు, రీటా, లంకా రాంబాబు, గాదె చరణ్, ఆనందాసు ప్రసాద్, అయ్యప్ప పాల్గొన్నారు.

పెంజంద్ర హైస్కూల్‌కు క్రీడా కిట్ పంపిణీ

గుడ్లవల్లేరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పెంజంద్ర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడా కిట్‌ను తప్పెట ఈశ్వర్ అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయునికి కిట్ అందజేశాక ఆయన మాట్లాడారు. పాఠశాల పూర్వ విద్యార్థిగా తన స్వగ్రామంలోని పాఠశాలకు సాయం చేశానని ఆయన తెలిపారు.

నిరుపేదలకు అన్నదానం

గుడ్లవల్లేరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): హై 5 యూత్ ఫౌండేషన్ గౌరవ సలహాదారు తెలంగాణ సిటీ స్మాల్ కాజల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.పి.అంజనీకుమారి జన్మదినం సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోత్రు నాగబాబు ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు శనివారం అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. లాక్‌డౌన్‌లోని రెండు కాల్వల మధ్యగట్టున జీవించే పేద కుటుంబాల వద్ద ఈ కార్యక్రమాలు నిర్వహించామని నాగబాబు తెలిపారు.

ముగిసిన భాగవత సప్తాహం

గుడివాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): వేణుగోపాలస్వామి దేవస్థానంలో ద్వారకాసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహం కార్యక్రమం శనివారంతో ముగిసింది. బాబాకు అభిషేకాలు, అష్టోత్తరాలు నిర్వహించారు. పెద ఎరుకపాడులోని శ్రీనాదోపాసన భజన మండలి వారితో షిరిడి సాయిభజన నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గీత గోవింద భక్తమండలి ఆధ్వర్యంలో భాగవత పారాయణం పూర్తి చేశారు. అనంతరం విశిష్ట వ్యక్తులను చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు పసుపు,కుంకుమలను అందజేశారు.



సప్తాహం ముగింపు సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న పండితుడు



మాట్లాడుతున్న ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్

పెన్షన్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

మచిలీపట్నం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సవరించిన పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించాలని ఏపీ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ చట్టం వల్ల రిటైర్డు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రిటైర్డు ఉద్యోగులకు పీఆర్సీ వల్ల కలిగే ప్రయోజనాలు లేకుండా పోతాయన్నారు. పీఆర్సీ, డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ఆశీర్వాదం, కోశాధికారి ఎ.శంకరరావు, ఉపాధ్యక్షుడు ఎస్.రాఘవరావు, ఎల్. వెంకటేశ్వరరావు, డి.కె.దుర్గారావు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి బహూకరణ

మోపిదేవి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన తాళం నితిన్ కుమార్ కుటుంబసభ్యులు రూ.2 లక్షల 25 వేలు విలువైన వెండి వస్తువులను శనివారం బహూకరించారు. ఆలయ ఈవో శ్రీరామ వరప్రసాదరావుకు 2 కేజీల 300 గ్రాముల(వెండి బిస్కెట్లు-11, సగం బిస్కెట్-1, చిన్న ముక్కలు 3, చిన్న గుండు -1)వస్తువులు వారు అందించారు. ఈ సందర్భంగా దాతను ఈవో సత్కరించారు.



ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావుకు వెండి వస్తువులు అందిస్తున్న దాత నితిన్‌కుమార్, కుటుంబసభ్యులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ఆంగ్లభాషపై పట్టు సాధించండి

● విద్యార్థులతో కేయూ వీసీ కూన రాంజీ

మచిలీపట్నం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆంగ్లభాషపై విద్యార్థులు పట్టు సాధించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ సూచించారు. కమ్యూనికేషన్, సాఫ్ట్‌స్కిల్స్‌లో నైపుణ్యం పెంచుకుంటే అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కేయూ ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ ఎం. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో లేడీయాంప్థిల్ కాలేజీ బాలికల వసతి గృహం-2లో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లీషు తరగతులను ఆయన ప్రారంభించారు. సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, కేయూ ఉద్యోగులు పాల్గొన్నారు.

చివరి భూములకూ సాగునీరందిస్తాం

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గూడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెడన నియోజకవర్గంలోని చివరి భూములకూ సాగునీరందిస్తామని, రైతులెవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ భరోసా ఇచ్చారు. శనివారం టీడీపీ గూడూరు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బల్లిపర్రు లాకుల వద్ద నీటిని విడుదల చేశామని, నియోజకవర్గం చివరి భూముల వరకు నీరు అందుతుందని తెలిపారు. డీసీ చైర్మన్లు పోతన స్వామి, నెక్కంటి బాస్కరరావు, బొర్రా కాశీ, పెడన జడ్పీటీసీ అర్జా నగేష్, కూనపరెడ్డి వీరబాబు, గోపీ నాగబాబు, నల్లమోతు రఘురాం, శీరం ప్రసాద్, ఎస్‌ఏ బేగ్, పోతన రామోజీ, బొర్రా ఏడుకొండలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

● ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఆయన ఇరిగేషన్ శాఖ ఈఈ, డీఈ, జేఈలతో సమావేశం నిర్వహించారు. గుడ్లవల్లేరు లాకుల నుంచి తాగునీటిని సక్రమంగా అందించాలని వారికి సూచించారు. దిగువ ప్రాంతమైన కృత్తివెన్ను మండలానికి పూర్తిస్థాయిలో సాగునీరందించి రైతులను ఆదుకోవాలన్నారు. మల్లేశ్వరం వంతెన దగ్గర 5 అడుగుల మేర నీటి మట్టం ఉండేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీసీ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు, టీడీపీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్

పెన్షన్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

మచిలీపట్నం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సవరించిన పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించాలని ఏపీ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ చట్టం వల్ల రిటైర్డు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రిటైర్డు ఉద్యోగులకు పీఆర్సీ వల్ల కలిగే ప్రయోజనాలు లేకుండా పోతాయన్నారు. పీఆర్సీ, డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ఆశీర్వాదం, కోశాధికారి ఎ.శంకరరావు, ఉపాధ్యక్షుడు ఎస్.రాఘవరావు, ఎల్. వెంకటేశ్వరరావు, డి.కె.దుర్గారావు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నాపురం పీఏసీఎస్ చైర్మన్‌గా పినిశెట్టి నిరంజనరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న పినిశెట్టి నిరంజనరావు

మచిలీపట్నం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చిన్నాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా పినిశెట్టి నిరంజనరావు, సభ్యుడిగా కంచర్ల వెంకటేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్‌యార్డు నిధులతో చిన్నాపురంలో రోడ్లు వేయిస్తామని మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని తెలిపారు. చిన్నాపురంలో నిషేధిత భూములను జాబితాల నుంచి తొలగిస్తే రైతులకు సహకార సంఘం ద్వారా ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాగిత గోపాలరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే నారాయణప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తలారి సోమశేఖర్, నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, వీరవల్లి సత్యనారాయణ, కార్యదర్శి రాజులపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుండుపాలెంలో తూమాటి బసవశంకరరావు బాధ్యతల స్వీకరణ

గుండుపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా తూమాటి బసవశంకరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. సహకారసంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. స్వల్పకాలిక రుణాలు రూ.2కోట్ల 14 లక్షలు, దీర్ఘకాలికరుణాలు రూ.2 కోట్ల 15 లక్షలు, రైతు నేస్తం రుణాలు రూ. 9 కోట్ల 15 లక్షలు, కర్షకమిత్ర కింద రూ.కోటి 77 లక్షలు రైతులకు సంఘంలో అందజేశామన్నారు. రూ.2 కోట్ల 40 లక్షలు ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్నాయని, రైతులు రికరింగ్ డిపాజిట్లు కూడా చెల్లిస్తున్నారని ఆయన తెలిపారు.

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదు

● టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు

నాగాయలంక, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్లపాటు విధ్వంసక పాలనను సాగించి ప్రజల ఛీత్కారానికి గురై అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను విమర్శించే అర్హత లేదని టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదంటూ శుక్రవారం అవనిగడ్డలో మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 80 శాతం హామీలను తొలి ఏడాదిలోనే అమలు చేశారని, ఇప్పటికైనా వైసీపీ నేతలు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

స్వచ్ఛ ఉద్యమానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాసరి రామ్మోహనరావు

చల్లపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ చల్లపల్లి సాధన కోసం సుందరీకరణ, అభివృద్ధి పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు విశ్రాంత పీఈటీ దాసరి రామ్మోహనరావు రూ.లక్ష విరాళాన్ని తన పుట్టినరోజు సందర్భంగా శనివారం అందజేశారు. స్వచ్ఛ చల్లపల్లి అభివృద్ధి కోసం ఆయన ఇప్పటికి రూ.26లక్షలు విరాళంగా అందజేశారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, పెద్దకుమారుడు డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు నగదును అందించారు. కుటుంబ సభ్యులు డాక్టర్ పద్మావతి, దాసరి వెంకటరమణ(చిన్నాజీ)- మాధవి, దాసరి లక్ష్మీరాణి- జాస్తి జ్ఞానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వెలివోలు మలుపు



చల్లపల్లి మండలం వెలివోలు గ్రామానికి వెళ్లే మలుపులో గొయ్యి

● తారురోడ్డు కుంగిపోయి గొయ్యిపడిన వైనం

(ఆంధ్రజ్యోతి-చల్లపల్లి): మండల పరిధిలోని వెలివోలులో గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మలుపు ప్రమాదకరంగా ఉంది. రోడ్డుపక్కనే బోదె ఉండటంతో మలుపులో రోడ్డు కుంగిపోయి గొయ్యి ఏర్పడింది. రోజురోజుకూ గొయ్యి పెద్దదవుతోంది. తారు రోడ్డు లేయర్, అడుగుభాగంలో కంకర రోడ్డు జారిపోతుండటంతో అగాథంగా మారిపోతోంది. ఆదమరిచి వెళితే ప్రమాదాల బారిన పడేందుకు ఆస్కారముంది. రాత్రివేళ ద్విచక్ర వాహనాలు, ఆటోలకు మలుపులో ప్రమాదాల జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గొయ్యి పెద్దదవకుండా, రోడ్డు కుంగిపోకుండా పటిష్ట పరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మోదుమూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా కూటమి పాలన

అవనిగడ్డ రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు అన్నారు. మోదుమూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరుగుతున్న, జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి టీడీపీ నాయకులు వివరించారు. డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్, జనసేన నాయకుడు గుడివాక శివరావు, బచ్చు వెంకట నాగప్రసాద్, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు హనుమాన్, విశ్వనాథుని మురళి, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, షేక్ గౌస్, బచ్చు మల్లి, బచ్చు గంగాధర్‌రావు పాల్గొన్నారు.



ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావుకు వెండి వస్తువులు అందిస్తున్న దాత నితిన్‌కుమార్, కుటుంబసభ్యులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి బహూకరణ

మోపిదేవి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన తాళం నితిన్ కుమార్ కుటుంబ సభ్యులు రూ.2 లక్షల 25 వేలు విలువైన వెండి వస్తువులను శనివారం బహూకరించారు. ఆలయ ఈవో శ్రీరామ వరప్రసాదరావుకు 2 కేజీల 300 గ్రాముల(వెండి బిస్కెట్లు-11, సగం బిస్కెట్-1, చిన్న ముక్కలు 3, చిన్న గుండు -1)వస్తువులు వారు అందించారు. ఈ సందర్భంగా దాతను ఈవో సత్కరించారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



సబ్బినేని బాబూ భవానీ వరప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

నాగాయలంక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మంచి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సంగమేశ్వరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన సబ్బినేని బాబూ భవానీ వరప్రసాద్ గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. సబ్బినేని బాబూ భవానీ వరప్రసాద్-సుజాత దంపతులను సభకు విచ్చేసిన వారంతా సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీజీ గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. 40 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని బాబూ భవానీవరప్రసాద్ సేవలను మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్ కొనియాడారు. యూటీఎఫ్ నేతలు కేఏ ఉమామహేశ్వరరావు, షౌకత్ హుస్సేన్, బి.కనకరావు, జె.లెనిన్‌బాబుతోపాటు టీవీఎం రామదాసు, ఎ.రామారావు, బి.శంకరనాథ్, సనకా రఘురాంప్రసాద్ ప్రసంగించారు. ఆరు మండలాల నుంచి ఉపాధ్యాయులు, అభిమానులు, ఆత్మీయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నాగాయలంక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సమర్పించిన ఆషాఢ సారె

కన్యకా పరమేశ్వరికి లక్షల మల్లెల పూజ, ఆషాఢ సారె

నాగాయలంక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్ష మల్లెలతో అర్చన చేసి, ఆషాఢ సారెను సమర్పించారు. ప్రసన్న గణపతి ఆలయం నుంచి మహిళలు లక్ష మల్లెలను, సారెను మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. సంఘం నేత చిట్టా శివనాగేశ్వరరావు- రాజేశ్వరి దంపతులు పూజ నిర్వహించారు.

పద్మావతి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు..

అవనిగడ్డ రూరల్: వేకనూరులో పద్మావతి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు ఆషాఢ సారెను గ్రామస్థులు సమర్పించారు. సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రజకుల రామాలయంలో..

ఘంటసాల: రజకుల రామాలయంలో ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రామాలయంలోని సీతారాముల విగ్రహ దాతలు పోతార్లంక శ్రీనివాసరావు-రజని దంపతులు సీతారాములకు అర్చకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి



మచిలీపట్నం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా 16న

మచిలీపట్నం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ఏజే కళాశాలలో ఈనెల 16న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ 45వ డివిజన్ ఇన్‌చార్జి పి.వి.ఫణికుమార్ సూచించారు. శనివారం జాబ్‌మేళా కరపత్రాలను నిరుద్యోగ యువతకు ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం ఆలోచన చేసే మంత్రి కొల్లు రవీంద్రపై వైసీపీ నేతల విమర్శలు సిగ్గుచేటన్నారు.

పాత ఉపకాలిలో తాగునీటి సరఫరా

నాగాయలంక, జూలై 12(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరం శివారు పాత ఉపకాలిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్‌తో మంచినీటిని శనివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సరఫరా చేయించారు. దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జ్ఞాపకార్థం మండలి ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.



ఇరాలి సమీపంలో రత్నకోడు మేజర్ డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్‌లోకి ఆక్వా రైతులు వేసిన తూములు

రత్నకోడు డ్రెయిన్‌పై అనధికార తూములు

● తొలగించాలని కోరుతున్నరైతులు

(ఆంధ్రజ్యోతి-కోడూరు): ఇరాలి గ్రామం వద్ద రత్నకోడు మేజర్ డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్‌లోకి అనధికారింగా ఆక్వా రైతులు తూములు వేశారు. వాటిని తొలగించాలని దిగువ ప్రాంత రైతులు కోరుతున్నారు. రత్నకోడు మేజర్ డ్రెయిన్‌ను అవనిగడ్డ దిగువ, కోడూరు ఎగువ మెరక ప్రాంత భూముల్లోని మురుగు నీటిని సముద్రంలోకి కలిపేందుకు, న్యూ ఇరాలి డ్రెయిన్‌ను కోడూరు దిగువ ప్రాంత పల్లపు భూముల్లోని నీరు పోయేందుకు ఉపయోగిస్తారు. కానీ ఆక్వా రైతులు తమ స్వలాభం కోసం రత్నకోడు మెరక డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్‌లోకి నాలుగు చోట్ల మీటర్ సైజు తూములు వేశారు. ఈ తూముల ద్వారా రత్నకోడునుంచి దిగువకు ఎప్పుడూ భారీగా నీరు ప్రవహిస్తోంది. దిగువ ప్రాంత భూముల్లోకి ఆ నీరు చేరి వేలాది ఎకరాలు మునిగిపోతున్నాయి. దీనిపై కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ తూములు తొలగించలేదని రైతులు అంటున్నారు. తూములు తొలగించాలని వారు కోరుతున్నారు.

> **తూములు తొలగిస్తాం**
> రత్నకోడు గట్టు వెంట జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తాం. అప్పుడు తూములు కూడా తొలగిస్తాం.
> - కరీం, డ్రెయినేజీ ఏఈ

బాలికపై అత్యాచారయత్నం

పెడన, జూలై 12(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారయత్నం ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దళిత బాలిక(11)ను పెదనందమూరు గ్రామానికి చెందిన పరసా ఫణి ఈనెల 10వ తేదీన పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారానికి యత్నించాడు. బాలిక పెద్దగా కేకలు వేసింది. అవి విన్న చుట్టుపక్కల వారు పొదల వద్దకు వచ్చేసరికి ఫణి పరారయ్యాడు. బాలిక తాత ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై జి.సత్యనారాయణ శనివారం ఫణిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరి మధ్య ఘర్షణ..ఒకరికి కత్తిపోట్లు

పెడన, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెడనలోని గుణ్ణాల దళితవాడకు చెందిన ఒక వ్యక్తి కత్తిపోట్లకు గురయిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుణ్ణాల దళితవాడకు చెందిన కోడూరు వెంకటేశ్వరరావు కుమార్తె అనూషను పెయింటర్ బెజవాడ జగదీష్ ప్రేమ వివాహం చేసుకుని విజయవాడ కానూరులో కాపురం ఉంటున్నాడు. జగదీష్ భార్యను వేధిస్తుండడంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. దీనిపై శుక్రవారం రాత్రి జగదీష్ తమ్ముడు, అనూష తండ్రి వెంకటేశ్వరరావుకు మధ్య వాగ్వివాదం జరిగింది. వారిరువురి మధ్య జరిగిన ఘర్షణలో వెంకటేశ్వరరావును జగదీష్ తమ్ముడు కత్తితో దాడి చేసి గాయపరిచాడు. వెంకటేశ్వరరావును చికిత్స నిమిత్తం బంధువులు బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు ఇచ్చిన సమాచారంపై పెడన పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.